జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నల్గొండ

శుక్రవారం | 7 | మార్చి | 2025 | పేజీలు : 7


# ఏసీబీ వలలో చిక్కిన చౌటుప్పల్ ట్రాన్స్ కో ఏడీ

**- రూ. 70 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత**



**చౌటుప్పల్ మార్చి 6( ప్రజా జ్యోతి ) :** సోలార్ విద్యుత్తు ప్లాంటుకు మీటరు అమర్చేందుకు లంచం డిమాండ్ చేసిన ఓ అవినీతి తిమింగలాన్ని ఏసీబీ అధికారులు పట్టివేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ ట్రాన్స్ కో కార్యాలయంలో ఆపరేషన్ ఏడీగా పనిచేస్తున్న గాజుల శ్యాం ప్రసాద్

మిగతా 2 లో..

## ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా ముందు జాగ్రత్త

# చర్యలు తీసుకోవాలి



**జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నల్గొండ మార్చి 06(ప్రజాజ్యోతి ప్రతినిధి):** ఈ వేసవిలో దేవరకొండ డివిజన్ పరిధిలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. గ్రామాలు, మున్సిపల్ కాలనీలలోని చివరి ఇండ్ల వరకు తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గురువారం ఆమె దేవరకొండ ఆర్ డి ఓ కార్యాలయంలో దేవరకొండ శాసనసభ్యులు బాలునాయక్ తో కలిసి దేవరకొండ డివిజన్ పరిధిలోని మండలాలలో తాగునీరు, ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్, ఆర్ అండ్ ఆర్ భూసేకరణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. దేవరకొండ మున్సిపాలిటీ తో పాటు, అన్ని గ్రామాలలో డిమాండ్ కు సరిపడ తాగునీటిని సరఫరా చేసే విధంగా మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, విద్యుత్ అధికారులు సంయుక్తంగా, సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ చెప్పారు. ఆయా మండలాల వారిగా తాగు నీటి డిమాండ్, ప్రస్తుతం చేస్తున్న తాగునీటి సరఫరాలను,


మిగతా 2 లో..

## కనుల పండువగా శ్రీశ్రీశ్రీ పద్మావతీ శ్రీ వేంకటేశ్వర స్వామి తిరు కళ్యాణ

# మహోత్సవం

- అంబరాన్ని అంటిన ఉత్సవం
- ప్రత్యేక ఆహ్వానితులుగా సినీనటి అంజలీ, నటుడు శ్రీనివాస్ రెడ్డి
- ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలి
- సినీనటి అంజలీ





**భూదాన్ పోచంపల్లి, మార్చి 05 (ప్రజాజ్యోతి)**
ప్రతి ఒక్కరూ భావాన్ని కలిగి దైవచింతనను అలవర్చుకోవాలని సినీనటి అంజలీ కోరారు. మండలంలోని కనుముక్కుల గ్రామంలో శ్రీశ్రీశ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ద్వావింశతి (22వ) వార్షిక బ్రహ్మోత్సవలలో

మిగతా 2 లో..

## ఇంటిగ్రేటెడ్,నవోదయ స్కూళ్లకు

# స్థలాల పరిశీలన

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్**

2 లో



# జానారెడ్డి తో సీఎం రేవంత్ భేటీ...

**హాలియా,మార్చి 6(ప్రజా జ్యోతి)** సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ సిఎల్పీ నేత కుందూరు జానారెడ్డి నివాసానికి బుధవారం వెళ్ళారు. ఇంటికి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి కి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వీరి మధ్య అరగంటకు పైగా చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. అయితే జానారెడ్డి తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ పై ప్రభుత్వ వర్గాల్లో చర్చ జోరుగా నడుస్తోంది. ఇటీవల బీసీ కులగనన విషయంలో తీన్మార్ మల్లన్న



మిగతా 2 లో..

## ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా ముందు జాగ్రత్త

# చర్యలు తీసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)



అలాగే ఎక్కడైనా తాగునీటి సరఫరాకు సరిపడే నీరు లేనట్లయితే ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించి వెంటనే ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్ మాట్లాడుతూ వర్షాకాలంలో నియోజకవర్గం పరిధిలో అన్ని చెరువులలో నీరు పుష్కలంగా ఉందని, వచ్చే జూన్ వరకు ఎలాంటి తాగు నీటి సమస్య రాకుండా చూడాలని అధికారులతో కోరారు. ముఖ్యంగా ఏప్రిల్, మే నెలలలో తాగునీటికి సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయని, అవసరమైతే అద్దె బోర్ల ద్వారా ప్రజలకు త్రాగునీరు అందించాలని, అలాగే తాగునీటి సరఫరాకు అవకాశాలు లేని చోట ప్రత్యామ్నాయ మార్గాలకు ప్రణాళిక రూపొందించాలని, ఎట్టి పరిస్థితులలో ప్రజలు తాగు నీటికి ఇబ్బంది పడకుండా చూడాలని కోరారు. ఎక్కడైనా తాగునీటి వనరులు, లేదా బోర్లకు చిన్నచిన్న మరమ్మతులు ఉన్నట్లయితే వాటిని చేపట్టి పూర్తిచేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని, రానున్న మూడు నెలల్లో ఎలాంటి సమస్యలు రాకుండా గ్రామాలు, వార్డుల్లో తిరిగి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. మల్లేపల్లిలో సంపు నిర్మాణంతో పాటు, ఆయా గ్రామాలలో అవసరమైన చోట బోర్లు లీజుకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. గత వేసవిలో ఆర్ డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ అధికారులందరూ బాగా పనిచేసి తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశారని ,ఈ సంవత్సరం సైతం అలాగే కృషి చేయాలని కోరారు. కొన్ని గ్రామాలలో తాగునీటి ఫ్లో వ్యాల్వును తొలగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ,దీనివల్ల తాగునీరు వృధా అవుతుందని, దీనిపై గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలని, ఒకవేళ ఎవరైనా బలవంతంగా వాల్వులు తీసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామన్న హెచ్చరికను తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పై సమీక్ష సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సైట్ క్లియర్ గా ఉన్నచోట తక్షణమే ఫోటోలను తీసి పంపించాలని, ఏవైనా సాంకేతిక సమస్యలు వస్తే తమ దృష్టికి తీసుకురావాలని, ఇందిరమ్మ ఇండ్ల పనులు ప్రారంభించే ముందు మార్కింగ్ చేసి సంబంధిత శాసనసభ్యుల ద్వారా ప్రారంభించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, మొదటి ప్రాధాన్యతలో పూర్తిగా ఇల్లు లేని వారికి, గుడిసెలో నివసిస్తున్న వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరిగిందని, జనవరి 26 న మంజూరు చేసిన జాబితాలు మరోసారి పూర్తి జాగ్రత్తగా పరిశీలించి అర్హులకు మాత్రమే ఇల్లు వచ్చేలా చూడాలని, ఎట్టి పరిస్థితులలో అనర్హులు రాకూడదని తెలిపారు. మొదటి ప్రాధాన్యత తర్వాత ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇండ్లు ఇవ్వడం జరుగుతుందని, రానున్న నాలుగేళ్లలో ప్రతి పేదవాడికి ప్రభుత్వం ఇల్లు కట్టించి ఇస్తుందని తెలిపారు . ఇందిరమ్మ ఇండ్ల బాధ్యత పూర్తిగా ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులదేనని ఆయన అన్నారు. భూసేకరణ సమీక్ష సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ నక్కలగండి కింద నక్కలగండి తండాలో ఇల్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇవ్వలేదని, దీనిపై మరోసారి విచారణ జరిపించి వారికి న్యాయం జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ తో కోరగా, ఈ విషయంపై ప్రభుత్వ నిబంధనలను మరోసారి పరిశీలించి 10 రోజుల్లో విచారించి తగు చర్య తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. పెండ్లి పాకల ప్రాజెక్టు కింద నాలుగు గ్రామాలలో ముంపు సందర్భంగా సర్వే సమయంలో నిర్మాణాలకు సంబంధించిన విలువను సరిగా చేయలేదని, అందువల్ల న్యాయపరంగా ఆ గ్రామాలలో ఇండ్లు నష్టపోయిన వారికి పరిహారం వచ్చేలా చూడాలని కలెక్టర్తో ఎం ఎల్ ఏ కోరారు. గుడి తండా, కారోబార్ తాండ తదితర గ్రామాలలో భూసేకరణ సమస్యలను ఈ సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, దేవరకొండ అడిషనల్ ఎస్పీ మౌనిక, దేవరకొండ ఇన్చార్జి ఆర్డీవో శ్రీదేవి, దేవరకొండ మున్సిపల్ కమిషనర్, మిషన్ భగీరథ ,ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్,విద్యుత్, అధికారులు, తహసిల్దారులు, ఎంపీడీవోలు ఈ సమీక్ష సమావేశానికి హాజరయ్యారు.

## ఇంటిగ్రేటెడ్,నవోదయ స్కూళ్లకు

# స్థలాల పరిశీలన

గరిడేపల్లి,మార్చి 06(ప్రజా జ్యోతి):

ఇంటిగ్రేటెడ్,నవోదయ స్కూళ్లకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ స్థలాల పరిశీలన చేశారు.గురువారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 57 లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కి 20 ఎకరాలు, నవోదయ విద్యాలయంకు 30 ఎకరాల స్థలంలో నూతనంగా నిర్మించబోయే స్కూల్ల స్థలాలను,టెండర్ ప్రక్రియను, స్కూల్లకు గడ్డిపల్లి పొలాల బాట,చిన్న గారకుంట తండ నుండి ఉన్న రోడ్డుని రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు.టిడబ్ల్యూఐడి సి ఇంజనీర్ రమేష్ ను రెసిడెన్షియల్ స్కూలుకు మంచి రహదారి నిర్మాణానికి సమగ్ర వివరాలతో పంపాలని తెలిపారు.నవోదయ విద్యాలయానికి 30 ఎకరాల స్థల సేకరణ జరుగుతున్నదని, అలాగే రెసిడెన్షియల్ స్కూల్ పనులు టెండర్ ప్రక్రియలో ఉన్నాయన్నారు.స్కూళ్ల నిర్మాణానికి అనువైన పరిస్థితులను,వాతావరణాన్ని తదితర అంశాలను పరిశీలించారు.ఆయన వెంట హుజూర్ నగర్ ఆర్డిఓ శ్రీనివాసులు,తహసిల్దార్ బండ కవిత,సర్వేయర్ భాస్కర్, ఆర్ఐ రాంబాబు,అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## కనుల పండువగా శ్రీశ్రీశ్రీ పద్మావతీ శ్రీ వేంకటేశ్వర స్వామి తిరు కళ్యాణ

# మహోత్సవం

(మొదటిపేజీ తరువాయి)

భాగంగా గురువారం రోజున ఉదయం హోమం, బలిహరణం, శ్రీ సూక్త హవనం, పూర్ణాహుతి. అనంతరం11గంటలకు వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ పద్మావతీ శ్రీ వేంకటేశ్వర స్వామి తిరు కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఆహ్వానితులుగా సినీనటి అంజలీ నటుడు శ్రీనివాస్ రెడ్డి విచ్చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి కళ్యాణ మహోత్సవం తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కర్తలు మాజీ జడ్పీటీసీ కోట మల్లారెడ్డి పుష్పలత కళ్యాణ కర్తలు ఆలయ అర్చకులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ఏసీబీ వలలో చిక్కిన చౌటుప్పల్ ట్రాన్స్ కో ఏడీ

(మొదటిపేజీ తరువాయి)

తంగడపల్లి లోని ఓ పరిశ్రమ యాజమాన్యం నుంచి రూ. 70 వేలు లంచం తీసుకుంటుండగా గురువారం ఏసీబీ అధికారులు వల వేసి పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం తంగడపల్లి రెవెన్యూ పరిధిలోని అక్రిట్ పరిశ్రమ యాజమాన్యం తమ పరిశ్రమలో సోలార్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటుకు ఓ సంస్థకు కాంట్రాక్ట్ అప్పగించారు.
ఈ సోలార్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటు చేసిన సదరు కాంట్రాక్ట్ సంస్థ సోలార్ నుండి ఉత్పత్తి అవుతున్న విద్యుత్తును పరిశ్రమలోని విద్యుత్ లైనుకు అనుసంధానం చేయడానికి కొత్త విద్యుత్తు మీటరు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులు పూర్తి చేస్తేనే సదరు కాంట్రాక్టర్ కు అక్రిట్ పరిశ్రమ యాజమాన్యం బిల్లులు విడుదల చేసే అవకాశం ఉంది.దీంతో కాంట్రాక్టర్ విద్యుత్ ఏడీ శ్యాం ప్రసాద్ కు విషయం తెలుపగా ఆయన తన పరిధిలో లేకున్నా డీఈ తో మాట్లాడి పనులు చేయిస్తానని సదరు కాంట్రాక్టర్ వద్ద రూ. 70 వేలు లంచం డిమాండ్ చేశారు. ఇదే విషయమై గురువారం చౌటుప్పల్ లో ఓ రహస్య ప్రదేశంలో కాంట్రాక్టర్ నుంచి రూ. 70 వేలను తీసుకుంటుండగా ముందస్తు సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేసి ఏడీ శ్యాంప్రసాద్ ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఏడీ శ్యాం ప్రసాద్ నుండి లంచం డబ్బులు స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు అతన్ని హైదరాబాద్ నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు.
ఈ దాడుల్లో ఏసీబీ డీఎస్పీ జగదీష్ చందర్, ఇన్స్పెక్టర్లు రామారావు, వెంకట్రావు పాల్గొన్నారు.

## జానారెడ్డి తో సీఎం రేవంత్ భేటీ...

ఆరోపణలు చేయడం ఇప్పుడు ఇద్దరూ కలవడం పట్ల రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తుంది.సీఎం రేవంత్ రెడ్డి జానారెడ్డిని ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా నియమిస్తారని ప్రచారం జరుగుతోంది.కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి,ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి ఉన్నారు.

## బాబుని తల్లి ఒడికి చేర్చిన నల్గొండ టూ టౌన్ పోలీసులు

నల్లగొండ మార్చి 6 (ప్రజా జ్యోతి)

పోలీసులు నిర్విరామంగా బృందాలుగా ఏర్పడి ఎట్టకేలకు బాలుడిని గుర్తించి తల్లి చెంతకు చేర్చారు.గత మూడు రోజుల క్రితం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో బాలుడి కిడ్నాప్ అయిన సంగతి అందరికి తెలిసిందే. కిడ్నాప్ చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నల్లగొండ టూ టౌన్ ఎస్ఐ రావుల నాగరాజు మాట్లాడుతూ.. ఆసుపత్రిలో పనిచేసే వ్యక్తి తనకు వరుసకు చెల్లెలు అయ్యే మహిళకు ముగ్గురు ఆడ పిల్లల సంతానం ఉన్నారు. ఆ మహిళకు మగ పిల్లవాడిని ఇచ్చేందుకు ఓ వ్యక్తి బాలుడిని తీసుకెళ్లినట్లు అతను ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. కిడ్నాపర్ ని అదుపులోకి తీసుకొని కేసునమోదు చేశామని పోలీసులు తెలిపారు



# గత పది ఏళ్లుగా పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ

## రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లింలకు నిత్యవసరాలు పంపిణీ





**కోదాడ టౌన్, మార్చి 6(ప్రజా జ్యోతి):** రంజాన్ పర్వదినం పురస్కరించుకొని బాబు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం కోదాడ పట్టణంలోని షాదిఖానా లో 700 మంది ముస్లిం పేదలకు నిత్యవసర సరుకుల కిట్లను పంపిణీ చేసినట్లు బాబు చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ మౌలానా అహ్మద్ నద్వి తెలిపారు. గత పది సంవత్సరాలుగా బాబు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రంజాన్ మాసం మొత్తం పట్టణంలోని అన్ని వీధుల్లో పేదలను గుర్తించి అనేక సహాయ సహకారాలు అందించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. బాబు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా విద్యా, వైద్యం నిత్యవసరాలు కనీస అవసరాలు తీర్చడమే బాబు చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు వికలాంగులకు ఋణాల కొరకు ఇంటర్వ్యూ



**చిట్యాల మార్చ్ 06(ప్రజా జ్యోతి)** సమగ్ర కార్యాచరణ ప్రణాళిక 2024-25 సం.కు గాను వికలాంగుల కార్పొరేషన్ నుండి చిట్యాల మండలమునకు ఒక్క యూనిట్ ఇవ్వడం జరిగింది. 1యూనిట్ 50 వేల రూపాయలు వికలాంగుల లోన్ కొరకు ఆన్లైన్ లబ్ధిదారుల నిర్వహణ పర్యవేక్షణ వ్యవస్థ ద్వారా దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులకు నేడు 11 గంటలకు చిట్యాల మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూస్ నిర్వహించబడును. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకురావాలి తీసుకురావాల్సిన సర్టిఫికెట్స్ ఆన్లైన్ ఫామ్,సదరం సర్టిఫికేట్,ఆధార్ కార్డు,రేషన్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు,ఇన్కమ్ సర్టిఫికెట్ తీసుకొని రావలసిందిగా ఎంపీడీవో ఎస్పీ జయలక్ష్మి ప్రకటనలో తెలిపారు.

# దేవాదాయ ఆస్తులను పరిరక్షించాలంటూ...!సబ్ కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన విశ్వహిందూ పరిషత్ నాయకులు



**మిర్యాలగూడ, మార్చి 06,( ప్రజాజ్యోతి ):** నియోజకవర్గంలో దేవాలయాలకు సంబంధించిన ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయని, కాపాడాలంటూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నాయకులు గురువారం సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా విభాగ్ కార్యదర్శి గంజి సుధాకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పురాతన ప్రాశస్త్యం కలిగిన ఎన్నో దేవాలయాలు ఉన్నాయని, వాటి పోషణ కోసం విలువైన భూములు,భవనాలు ఉన్నాయని కానీ అధికారుల పర్యవేక్షణ లోపం కొందరు రాజకీయ అండదండలతో అన్యాక్రాంతం చేసుకుంటున్నారని ఆరోపించారు. మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ లో ఎస్వీ ఫంక్షన్ హాల్ వెనుక వైపు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని కొంతమంది మసీదు నిర్మాణం చేపట్టారన్నారు. పట్టణంలోని నడిబొడ్డులో ఉన్న శ్రీనివాస్ థియేటర్ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని కొందరు మసీదు నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. వీటితోపాటు వీర్లపాలెం, తాళ్ల వీరప్ప గూడెం, వాడపల్లి, అవంతిపురం,ఆమనగల్లు లలోని దేవాదాయ భూములు చాలావరకు ఇప్పటికే అన్యాక్రాంతమైపోయాయని అన్నారు. దేవాలయాల ధూపదీప నైవేద్యాల కోసం, ఆలయాల అభివృద్ధి కోసం కేటాయించిన విలువైన భూములు,భవనాలు,ఆస్తులను కొందరు ఆక్రమించుకొన్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భూములపై సర్వే నిర్వహించి ఆస్తులను రక్షించాలని, దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. వారి వెంట సత్సంగ్ ప్రముఖ్ రాపర్తి శ్రీనివాస్, రమేష్, బి.సంపత్, బి. నవతేజ్ తదితరులు ఉన్నారు.

# జర్నలిస్ట్ రఘు మృతి బాధాకరం

## ఐజేయు జిల్లా అధ్యక్షులు గింజల అప్పిరెడ్డి



**కోదాడ టౌన్, మార్చి 6 (ప్రజా జ్యోతి):** జర్నలిస్ట్ రఘు మృతి బాధాకరమని ఐజేయు జిల్లా అధ్యక్షులు గింజల అప్పిరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ కాలనీ లో ఐజేయు ఆధ్వర్యంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన రఘు కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రఘు కుటుంబానికి 20వేల రూపాయల ఆర్థిక స్థాయాన్ని అందజేసి మాట్లాడారు. మీడియా రంగంలో రఘు కనపరిచిన ప్రతిభ ఎనలేనిదని కొనియాడారు. ఆయన మృతికి ఐజేయు ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టు రఘు కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఐజేయు ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు సలిగంటి మురళి,ఆవుల మల్లికార్జున్, పల్లపు శ్రీనివాస్, దామోదర్, అజయ్, వెలిశాల శ్రీనివాస్, కరుణాకర్, రమేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# పాడి రైతులకు క్రెడిట్ కార్డు రుణాల పంపిణీ

## పాడి రైతులు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎస్బిఐ చీఫ్ మేనేజర్ వంశీ

**చిట్యాల మార్చ్ 06(ప్రజా జ్యోతి)** ప్రభుత్వ పథకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్బిఐ చీఫ్ మేనేజర్ వంశీ,జిల్లా పశుసంవర్ధక శాఖ పశు వైద్యాధికారి డాక్టర్ జి వి రమేష్ అన్నారు. చిట్యాల మండలంలో ఎస్ బిఐ బ్యాంక్ బ్రాంచ్ ఆవరణలో గురువారం నాడు ఎంపిక చేసిన పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు రుణాలు పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఎంపికైన 26 మంది పాడి రైతులకు 22 లక్షల రుణం మంజూరుకు సంబంధించిన పత్రాలను అందజేసి మాట్లాడుతూ జీవాల పెంపకదారుల పశు పోషణకు ప్రభుత్వ అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు కిసాన్ క్రెడిట్ రుణాలను జిల్లాలో మొట్టమొదటిసారిగా చిట్యాలకు పంపిణీ చేయడమైనది సకాలంలో రుణాలను చెల్లించినట్లయితే మరొకసారి రుణాలను పొందేటందుకు సులువుగా ఉంటుందని అన్నారు ఆసక్తిగల రైతులు స్థానిక పశువైద్యాధికారులు లేదా సిబ్బందిని సంప్రదించగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకు డాక్టర్ సయ్యద్ ముస్తాక్ ఖాద్రి,చిట్యాల ఎస్బిఐ మేనేజర్ వరప్రసాద్,ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాసరావు,చిట్యాల,ఉరుమడ్ల పశువైద్య అధికారులు డా వి అభినవ్, డా అమరేందర్,మదర్ డైరీ చిల్లింగ్ సెంటర్ మేనేజర్ చెన్నారెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# సాయి మందిరంలో పూజలు అన్నదానం

**కోదాడ టౌన్, మార్చి 6 ( ప్రజా జ్యోతి):** కోదాడ మండల పరిధిలో రామాపురం క్రాస్ రోడ్ సాయి మందిరంలో గురువారం పూజలు అన్నదానం నిర్వహించారు. కోదాడ రూరల్ ఎస్సై అనిల్ రెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్న అన్నదానం ప్రారంభించారు. అన్నదాత ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం పెద్ద మోదుగు పల్లి గ్రామ వాసులు కనగాల కోటయ్య తులసమ్మ దంపతులు వారి కుమారుడు పుల్లారావు రజిని ముఖ్య అతిథులు ముంద్రారంగారావు, శర్బయ శరభయా రామారావు, రమేష్, శివరామకృష్ణ, దేవాలయ కమిటీ చైర్మన్ నులపాటి నరసింహారావు సాయి శర్మ పాల్గొన్నారు.



# టాటా ఏఐఏ లైఫ్ మైక్రో ఇన్సూరెన్స్ పేదలకు వరం

## కోదాడ బ్రాంచ్ మేనేజర్ పోలిశెట్టి సైదులు



**గరిడేపల్లి,మార్చి 06(ప్రజా జ్యోతి):**
టాటా ఏఐఏ లైఫ్ మైక్రో ఇన్సూరెన్స్ పేదల ప్రజలకు వరమని కోదాడ బ్రాంచ్ మేనేజర్ పోలిశెట్టి సైదులు అన్నారు.ఇటీవల కాలంలో పాలసీదారురాలైన ప్రధాని వెంకమ్మ అనారోగ్యంతో మృతి చెందటం జరిగింది.విషయం తెలుసుకున్న మేనేజర్ పాలసీ తీసుకున్న వెంకమ్మ కి నామినీగా ఉన్న తన కుమార్తె సరితకు క్లెమ్ అమౌంట్ రెండు లక్షల రూపాయల చెక్కును అందజేశారు.ప్రతి ఒక్కరూ టాటా ఏఐఏ మైక్రో ఇన్సూరెన్స్ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ బొమ్మ నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నాగారం మండల హార్వెస్టర్ నూతన కమిటీ ఎన్నిక.



**నాగారం మార్చి 6 ప్రజా జ్యోతి.**
నాగారం మండల హార్వెస్టర్ యూనియన్ నూతన కమిటీ నీ గురువారం ఏక గ్రీవం ఎన్నుకున్నట్లు కమిటీ అధ్యక్షులు నర్సింగ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షులుగా కడారి సైదులు, కార్యదర్శిగా వడ్డకొండ అంజయ్య, కోశాధికారిగా దశరథ, ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ వివిధ గ్రామాల సభ్యుల సమక్షంలో కమిటీని ఎన్నుకోవడం జరిగిందని ఎన్నికకు సహకరించిన సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

# గ్రామాల్లో త్రాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

**భూదాన్ పోచంపల్లి, మార్చి 06 (ప్రజాజ్యోతి)**
గ్రామాల్లో త్రాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ ఆర్.భాస్కర్ తెలిపారు. గురువారం రోజున మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సబ్ కి యోజన సబ్ కా వికాస్ 15వ ఆర్థిక సంఘం 2025-26 ఆర్థిక సంవత్సరం నిధులకు సంబంధించిన అభివృద్ధి ప్రణాళిక కార్యాచరణపై ప్రత్యేక సమీక్షా సమావేశం ఎంపీడీఓ ఆర్. భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో త్రాగునీరు వేసవికాలంలో మంచినీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ఇతర అభివృద్ధి పనుల ప్రణాళికలు చర్చించారు. ఈ సమావేశములో మండల స్థాయి అధికారులు మరియు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# ప్రభుత్వం తక్షణమే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి....!

## - సిపిఎం మండల కార్యదర్శి రవినాయక్



మిర్యాలగూడ,మార్చి 06,( ప్రజాజ్యోతి ):- రాష్ట్రంలో ప్రభుత్వం తక్షణమే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు సిపిఎం మండల కార్యదర్శి రవి నాయక్. సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యల అధ్యయనంలో భాగంగా మిర్యాలగూడ మండలం చిల్లాపురం గ్రామం లో గురువారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరాష్ట్రంలో ఉద్యోగ నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేసిన తప్పు మళ్ళీ ఈ ప్రభుత్వం కూడా చేయకుండా యువతకు ఇచ్చినా హామీ వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మీద యువతకు అనేక ఆశలు ఉన్నాయని ఆ ఆశలు అడియాశలు చేయకుండా ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలన్నారు . ముఖ్యంగా గ్రూప్ 4 ఇతర గ్రూపులు, పోలీస్ కానిస్టేబుల్ నియామకాలు వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలని ఆయన కోరారు. దాదాపు రాష్ట్రంలో 40 లక్షలపై నిరుద్యోగులు ఉన్నారని ఉద్యోగాలన్న ఇవ్వాలని, లేదా ఉపాధి అన్న చూపించాలని, దానికోసం జిల్లాలో స్థానిక పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధి చూపలేని పక్షంలో కనీసం నిరుద్యోగ భృతి అయిన ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా పదివేల రూపాయలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వం ఖచ్చితంగా నిరుద్యోగ ఆశలు తీరుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కోట్ల శ్రీనివాస్రెడ్డి, ఆశీర్వాదం, సైదులు, రవి పాల్గొన్నారు.

# మహిళలు స్వేచ్ఛ సమానత్వం కోసం ఉద్యమించాలి

## - ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ



**భూదాన్ పోచంపల్లి, మార్చి 06 (ప్రజాజ్యోతి)**
నేటి ఆధునికంలో మహిళలు స్వేచ్ఛ సమానత్వం కోసం ఉద్యమించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ అన్నారు. భూదాన్ పోచంపల్లి మండలంలోని పిల్లాయిపల్లి గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు పగిళ్ల లావణ్య అధ్యక్షతన ముఖ్యఅతిథిగా ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ విచ్చేసి మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం మతోన్మాద విధానాలను వేగవంతం చేస్తుందని అన్నారు. దేశంలో మహిళలు అభద్రతతో జీవిస్తున్నారని మతోన్మాదం మత్తులో చెలరేగిపోతునాదని మహిళలు సంఘటితమై ప్రతిఘటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు అందెల జ్యోతి, బంధారపు నిర్మల, అబ్బావతి లక్ష్మి, పస్నూరు విజయ, కందాడి రాములమ్మ, బందెల జయమ్మ, బందారపు సమంత, కొంత నిర్మల, నడికుడి మంజుల, అందెల బాలమని తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సారెస్పీ జలాలు అందించి రైతులను ఆదుకోవాలి

## జలాల కోసం రైతుల నిరసన




**తుంగతుర్తి, మార్చి 6, (ప్రజా జ్యోతి)**
ఎస్సారెస్పీ వరద కాల్వ ద్వారా పంట పొలాలకు సాగునీటిని అందిం చాలని, కండ్ల ముందే పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తుంగతు మండల కేంద్రంలో రైతులు ఎస్సారెస్పీ కాలువలో కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ..మాయమాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రైతులను మోసం చేస్తున్నదని మండిపడ్డారు.కాల్వ వస్తుందనే ఆశతో నాట్లు వేశామని ఇప్పుడు నీరు ఇవ్వకుంటే రైతులకు ఎకరాకి వేలల్లో నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.శ్రీరాంసాగర్ రిజర్వాయర్ నిండా నీళ్ల నిల్వ ఉన్నా సరిపడ సాగునీరు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు.డిమాండ్ చేశారు. సాగుచేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని, ఎక్కువ నీటిని విడుదల చేసి రైతన్నను ఆదుకోవాలని కోరారు.అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కనికరం చూపిస్తలేరని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల కోసం పెట్టిన పెట్టుబడులు భారంగా మారాయన్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి పంట పొలాలకు సాగు నీరు అందివ్వాలన్నారు.

# మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేద్దాం

## ఏఎంసి చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి

**తుంగతుర్తి, మార్చి 6,(ప్రజా జ్యోతి)**
తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చెద్దామని తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి అన్నారు. గురువారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో పాలకవర్గ సర్వసభ్య సమావేశం చైర్మన్ తీగల రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ పలు అంశాలపై సభ్యులతో చర్చించారు.రాబోయే రోజుల్లో రైతు సంక్షేమం కోసం వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా వ్యాపారులు రైతుల ధాన్యం క్రయవిక్రయాలు జరిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతు సంక్షేమం ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని తెలియజేస్తూ తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ సహకారంతో ఈ మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.ఈ సమావేశంలో వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, ఉమ్మడి నల్లగొండ జిల్లా డిసిసిబి డిసిఎంఎస్ డైరెక్టర్ గుడిపాటి సైదులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# చెట్టుకు ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

**పెట్రోల్ బంక్ యాజమాని పోలీసులకు పిర్యాదు చేయడం తో భయపడి ఆత్మహత్యకు పాల్పడినట్టు బంధువుల ఆరోపణ**

**– శవంతో బంక్ ఎదుట ఆందోళన చేసేందుకు ప్రయత్నం అడ్డుకున్న పోలీసులు**






**మిర్యాలగూడ, మార్చి 06,( ప్రజాజ్యోతి ):**

చెట్టుకు ఉరి వేసుకుని గంధం అరుణ్ కుమార్ (26) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన మిర్యాలగూడ పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం వెలుగు చూసింది.కాగా ఇటీవల మృతుడు పనిచేస్తున్న పెట్రోల్ బంక్ యజమాని డబ్బులు అపహరించాడంటూ వాడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయటం వల్లే భయపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపిస్తూ మృతుడి బంధువులు గ్రామ పెద్దలు ఆందోళనకి దిగారు. రూరల్ ఎస్ఐ పి. లోకేష్ కథనం మేరకు దామరచర్ల మండలం వాడపల్లి గ్రామానికి చెందిన మృతుడు అరుణ్ కుమార్ గత ఆరు నెలలుగా దామరచర్ల లోని నాగకృష్ణ పెట్రోల్ బంకులో వర్కర్ గా పని చేస్తున్నాడన్నారు. ఈనెల 1న యధావిధిగా విధులకు వెళ్లిన అరుణ్ కుమార్ రెండు రోజులు బంకులో పనిచేసి ఆ పై ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడని, గురువారం మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలోని జామాయిల్ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిపారు. మృతుని తమ్ముడు గంధం వెంకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.కాగా మృతుడు దామరచర్ల లోని పెట్రోల్ బంకు నగదును అపహరించాడంటూ ఇటీవల యాజమాన్యం , ఈ విషయమై అరుణ్ ను గట్టిగా నిలదీసి వాడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. అందువల్లనే భయపడి ఆత్మహత్యకు పాలుపడ్డాడు అంటూ గురువారం పెట్రోల్ బంక్ ఎదుట శవాన్ని ఉంచి ఆందోళన చేసేందుకు సిద్ధపడగా సమాచారం అందుకున్న వాడపల్లి పోలీసులు దామరచర్ల లోని జాన్ పాడ్ ఎక్స్ రోడ్డు వద్ద వారిని అడ్డుకోవడంతో కాసేపు తీవ్రవాగ్వివాదం జరిగింది. ఇంచార్జ్ ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆందోళనకారులతో మాట్లాడి అక్కడనుండి పంపించి వేశారు.



# ఈ నెల 9 హైదరాబాద్ లో పద్మశాలి మహాసభను విజయవంతం చేయాలి



**రాజాపేట మార్చి 6 (ప్రజా జ్యోతి)**

అఖిల భారత పద్మశాలి మహాసభను విజయవంతం చేయాలని రఘునాథపురం గ్రామానికి చెందిన ,తెలంగాణ ప్రాంత పద్మశాలి యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సామల భాస్కర్ కోరారు. గురువారం రఘునాథపురంలో పద్మశాలి యువ నాయకుల ఆధ్వర్యంలో పద్మశాలి మహాసభ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 103 సంవత్సరాల చరిత్ర గల అఖిలభారత పద్మశాలి సంఘం చరిత్రలో మరో మైలురాయి,17 వ, అఖిలభారత పద్మశాలి మహాసభ అదేవిధంగా తెలంగాణ ప్రాంత పద్మశాలి ఎనిమిదవ మహాసభ ఈనెల 9వ, తేదీన హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో జరిగే 17వ, అఖిలభారత పద్మశాలి మహాసభ మరియు 8 వ, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహాసభ లకు ఈ దేశంలోని 18 రాష్ట్రాల నుండి ప్రజా ప్రతినిధులు పద్మశాలి కుల బంధువులు అదేవిధంగా అక్కడి కార్యవర్గ సభ్యులు అదేవిధంగా మన తెలంగాణలోని 33 జిల్లాలలో నుండి పద్మశాలి కుల బంధువులు చేనేత వర్గాల నాయకులు అదేవిధంగా మరమగ్గాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని ఈ మహాసభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తో పాటు, మంత్రి వర్గం హాజరవుతున్నారని తెలిపారు, ప్రజలకు వాక్ స్వాతంత్రము సామాజిక స్వాతంత్రము లేని నీరంకుశ పరిపాలనలోనే మన సమాజ పెద్దలు ధైర్యసాహసాలతో 1921 సంవత్సరంలోనే అఖిల భారత పద్మశాలి సంఘం ను స్థాపించి మన ఐకమత్యమును సభ్య సమాజమునకు చాటినారు ఆకాలంలోనే రాజులకు పెత్తందారులకు పెట్టుబడి దారుల యొక్క బెదిరింపులకు భయపడక సంఘం స్థాపించి సభలు సమావేశాలు నిర్వహించడం సామాన్య విషయము కాదు నేటి యువతరం ఈ దిశగా ఆలోచించాల్సిన అవసరము ఎంతైనా ఉంది,కావున మన సమస్యలను సంఘ ఐక్యతను ప్రభుత్వాలు దృష్టికి తీసుకుపోయి వాటి పరిష్కారానికి సమాజ ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేయాలని పట్టుదలగా తీసుకోవడమైనదని ఇందు కొరకు రాష్ట్ర జిల్లా గ్రామ పట్టణాల నుండి మన పద్మశాలీలు అంతా ప్రభంజనంగా ఈ సమావేశమునకు హాజరై జయప్రదం చేసి సంఘ ఐక్యతను చాటాలని పద్మశాలి కుల బాంధవులకు ముఖ్యంగా యువ నాయకులకు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో పద్మశాలి యువ నాయకులు బల్ల సుదర్శన్, కటకం గణేష్ , బల్ల గణేష్, బల్ల రాజు, చిప్ప సుదర్శన్, కటకం పృద్వి, గోలి కిరణ్ కుమార్, వనం సంతోష్ తదితరులు పాల్గొన్నారు

## బొందుగుల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్

**రాజాపేట, మార్చి 6 (ప్రజా జ్యోతి)**

రాజాపేట మండలం బొందుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఆకస్మికంగా సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థులు అందరూ ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యేలా ప్రతి ఒక్క ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు.ప్రీఫైనల్ తెలుగు పరీక్ష రాస్తున్న విద్యార్థుల వద్దకు వెళ్లి పరిశీలించారు.ప్రధాన ఉపాధ్యాయుడు జక్కుల ప్రభాకర్ ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.విద్యార్థులకు మంచి వాతావరణంలో నాణ్యమైన విద్య అందించడానికి కృషి చేయాలని సూచించారు. బొందుగుల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెల్ల ప్రభాకర్, భారతి, భావిక, జయలక్ష్మి, సోమిరెడ్డి, మాధవి రమేష్, పి.డి. ఐలోని శోభారాణి, గౌస్ పాషా, జరీనా, రఫిక్ తదితరులున్నారు. క్రమశిక్షణ పాఠశాల వాతావరణం విద్యార్థుల నుండి వచ్చిన సమాధానాల పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేసి సంతోషపడ్డారు.




## ప్రశాంతంగా రెండో రోజు ఇంటర్మీడియట్ పరీక్షలు



**నాంపల్లి,మార్చి,06(ప్రజా జ్యోతి):**

ఈనెల 5న ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజు తెలుగు ,సంస్కృతం అరబిక్, ఉర్దూ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు చీఫ్ సూపర్డెంట్ ఈ రజినీకాంత్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ ఎస్ జయప్రకాష్ తెలిపారు. నాంపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నాటి పరీక్షలకు 378 మంది హాజరు కావలసి ఉండగా 9 మంది గైర్హాజరైనట్లు వారు తెలిపారు. ఈ పరీక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ షీభా బృందం తనిఖీ చేసినట్లు వారు పేర్కొన్నారు..ఈ పరీక్షలకు సెట్ -ఏ ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేశారు.

## నర్సరీలో మొక్కలను సంరక్షించాలి..

### ఎంపీడీవో బొజ్జ సందీప్ కుమార్




**చౌటుప్పల్ మార్చి 6 ( ప్రజా జ్యోతి )**

నర్సరీలో మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చౌటుప్పల్ ఎంపీడీవో బొజ్జ సందీప్ కుమార్ అన్నారు. గురువారం కొయ్యలగూడెం లోని నర్సరీని ఆయన సందర్శించారు.నర్సరీలో ఏయే మొక్కలు పెంచుతున్నారో పరిశీలించారు.మొక్కలకు ఎప్పటికప్పుడు నీళ్లు పోస్తూ ఏపుగా పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.పిచ్చిమొక్కలు పెరిగితే వెంటనే తొలగించాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాచర్లు సూచించారు.ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మారం జలందర్ రెడ్డి, కారోబార్ బిక్షం లు ఉన్నారు.

## ప్రారంభమైన ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు

**వలిగొండ,మార్చి 06(ప్రజాజ్యోతి న్యూస్) :**

మండలకేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, మండలంలోని లోతుకుంట మోడల్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సర వార్షిక పరీక్షలు గురువారం ప్రారంభం అయ్యాయి. మండల వ్యాప్తంగా మొత్తం విద్యార్థులు 312 మందికి గాను 309 మంది హాజరై 3 గురు విద్యార్థులు గైరాజర్ అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్ కుమార్ తెలిపారు.

## హలో పద్మశాలి ఛలో హైదరాబాద్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**నాంపల్లి,మార్చి,06(ప్రజా జ్యోతి):**

17వ అఖిల భారత పద్మశాలి మహాసభ మరియు 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహాసభలు ఈ నెల 9న ఎగ్జిబిషన్ గ్రౌండ్, నాంపల్లి, హైదరాబాదులో జరగనున్నాయి. గురువారం నాంపల్లి మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో "హలో పద్మశాలి ఛలో హైదరాబాద్" మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా పద్మశాలి సంఘం అధ్యక్షుడు కోట రఘునందన్ మాట్లాడుతూ మహాసభల కార్యక్రమానికి పద్మశాలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గోలి కృష్ణ,సంఘం గణేష్, గుర్రం శ్రీరాములు, భరతయ్య, వెంకటేశ్వర్లు, గణేష్, కిరణ్ ,రుద్ర వెంకటేశ్వర్లు, పాపయ్య విజయ్, అనిల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజ్ఞాపురం రామకృష్ణ జన్మదిన సందర్భంగా అన్నదానం



**నార్కట్ పల్లి,మార్చి 6 ( ప్రజా జ్యోతి ):**
మండల కేంద్రానికి చెందిన ప్రజ్ఞాపురం రామకృష్ణ( ఆర్కె ) జన్మదిన సందర్భంగా మనం స్వచ్ఛంద సేవ సంస్థ " ఆధ్వర్యంలో వందమంది నిరుపేదలకు. మరియు బాటసారిలకు ఆయన స్నేహితులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మనం స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపకులు దైద నాగరాజు ప్రజ్ఞాపురం రామకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## పోలీస్ బందోబస్తు నడుమ కూల్చివేతల ప్రారంభం



**మిర్యాలగూడ,మార్చి 06,( ప్రజాజ్యోతి ):-**
కోదాడ - జడ్చర్ల జాతీయ రహదారి నంబర్ 167(ఫోర్ వే) నిర్మాణంలో భాగంగా గురువారం మిర్యాలగూడ పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు మున్సిపల్ టౌన్ ప్లానింగ్, జాతీయ రహదారి శాఖ అధికారులు పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేత పనులు జెసిబితో చేపట్టారు. కొన్ని దుకాణాల ముందు భాగం తొలగించారు. దీంతో స్పందించిన దుకాణదారులు, భవనాల యజమానులు తామే మార్కింగ్ చేసిన మేర భవనాలనుతొలగించుకుంటామని పేర్కొనడంతో తాత్కాలికంగా నిలిపి వేశారు. డివైడర్ నుండి ఇరు వైపులా 50 అడుగుల మేర ఉండాలని, నిర్ణీత సమయంలో మార్కింగ్ చేసిన మేర తొలగించాలని తొలగించకుంటే తాము తొలగిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఇఇ వెంకన్న, టీపిఎస్ అంజయ్య, వన్ టౌన్ పోలీస్ ఇన్స్పెక్టర్ పి.నాగార్జున, జాతీయ రహదారి అధికారులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ జెడ్పిటిసి



**నార్కట్ పల్లి,మార్చి 6 ( ప్రజా జ్యోతి):**
మండల పరిధిలోని అమ్మనబోలు మసీదులో గిన్నెల శివప్రసాద్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ జెడ్పిటిసి సభ్యులు దూదిమెట్ల సత్తయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కావటి యాదయ్య. కామటి పరశురాం. మండల పార్టీ ఉప అధ్యక్షుడు రాపోలు వెంకటేశం. మైనార్టీ సభ్యులు షేక్ యూనివర్స్ గ యూనస్. ముజీబ్ మునిష్. ఫయాజ్. సలీం కాసిం పాల్గొన్నారు.

## అంగన్వాడీలపై సమీక్షా సమావేశం.

**మునగాల మార్చి 6 ప్రజా జ్యోతి):-**
మునగాల మండల కేంద్రంలోని రైతు వేదిక ఐసిడిఎస్ ప్రాజెక్టు మీటింగ్లో భాగంగా మునగాల నడిగూడెం మండలాల లోని అంగన్వాడీల పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా డీ డబ్ల్యూఓ నరసింహారావు, సిడిపిఓ పారిజాత, సూపర్వైజర్లు సరిత శ్రీలత రజిని, పోషణ అభియాన్ సిబ్బంది, ఐసిపిఎస్ విద్యాసాగర్, మరియు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.




## మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులకు క్రీడలు, ఉచిత వైద్య శిబిరం





**మిర్యాలగూడ, మార్చి06,( ప్రజాజ్యోతి ):**
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలో మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్, గైనకాలజీ సొసైటీ సహకారంతో నల్లగొండ జిల్లా టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో అధ్యక్షులు నాగిళ్ల మురళి, కారదర్శి జె.శేఖర్ రెడ్డి అధ్యక్షతన ఉచిత మెగా ఉమెన్ హెల్త్ క్యాంపు, క్రీడా పోటీలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హెల్త్ క్యాంపు, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలలో మహిళా ఉద్యోగినులు, పశుసంవర్ధక శాఖ మహిళా ఉద్యోగినులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగాటిఎన్జిఓస్ అధ్యక్ష కార్యదర్శులు ఎన్.మురళీ, జె.శేఖర్ రెడ్డి లు మాట్లాడుతూ మహిళలు ఉద్యోగ, కుటుంబ భాధ్యతలలో ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలన్నారు. అందరికీ ఉచిత మెగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహింస్తున్నా మన్నారు. ఉద్యోగ, కుటుంబ బాధ్యతలతో రోజు ఎంతో ఒత్తిడికి గురయ్యే మహిళ ఉద్యోగులకు క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల వలన వారికి కొంత మానసిక ఉల్లాసం కలుగుతుందని పాల్గొన్న మహిళా ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. వెటర్నరీ పారావెట్ ఫోరం అధ్యక్షులు ఎండి.అజీమొద్దీన్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మహిళా అభ్యుదయమే సమాజ అభ్యుదయమన్నారు. విద్య, వైద్య, రవాణా, సాంస్కృతిక, రాజకీయ, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో రాణిస్తున్న మహిళలు శక్తివంతులుగా ఆరోగ్యంగా ఉండవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. విలువైన పరీక్షలను, ఉచిత మెగా మహిళా ఆరోగ్య శిబిరం, క్రీడపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినందుకు టీఎన్జీఓస్ అధ్యక్ష కార్యదర్శులకు వైద్యారోగ్య శాఖ బృందానికి, డాక్టర్స్ బృందానికి తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటరినేరియన్స్ అసోసియేషన్ నల్గొండ జిల్లా పక్షాన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుజాత, రాధిక, జ్యోతిలత, శివనాగ మల్లేశ్వరి, నవనీత, కౌసర్ జహాన్, స్వాతి, సమీన, సౌజన్య,రేణుక, అనిత కన్యాకుమారి, ఇందిరా పాల్గొన్నారు.

## బిజెపి వైపే తెలంగాణ ఉపాధ్యాయుల, పట్టభద్రుల చూపు

**రమావత్ నరి నాయక్ పాలకవీడు మండల అధ్యక్షులు.**



**పాలక వీడు, మర్చి 6(ప్రజా జ్యోతి ):**
ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయులు ఎమ్మెల్సీగా మల్క కొమరయ్య,, ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా చిన్నమైల్ అంజిరెడ్డి ల ఘన విజయం సాధించినందుకు తెలంగాణ రాష్ట్ర బిజెపి పార్టీ అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి పిలుపు మేరకు హుజూర్నగర్ నియోజకవర్గం, పాలకవీడు మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు రమావత్ నరీ నాయక్ నిర్వహించిన విజయోత్సవ సంబరాలు ఈ సందర్భంగా రమావత్ నరి నాయక్ మాట్లాడుతూ..ఉత్తర తెలంగాణ బిజెపి కంచుకోటగా మారిందని, మోదీ విధానాలకు ఉపాధ్యాయులు, మేధావులు, పట్టభద్రులు పట్టం కట్టారని అన్నారు. కాంగ్రెస్ పతనానికి ఈ విజయమే నాందని కాంగ్రెస్పై ప్రజా వ్యతిరేకతకు నిదర్శనం ఈ విజయం అని అన్నారు. అదేవిదంగా ఈ విజయంలో పాలుపంచుకున్న ఉపాధ్యాయులకు, పట్టబద్రులకు, బిజెపి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేసారు.అనంతరం బిజెపి శ్రేణులు అంతా బానసంచా కాల్చి, స్వీట్స్ పంపిణీ చేస్తూ హర్షం వ్యక్తపరిచారు.ఇట్టి విజయోత్సవ వేడుకల్లో మండల సీనియర్ నాయకులు కొత్తూరి వెంకటేశ్వర్లు మంద లాజర్, కుందూరు మట్టా రెడ్డి, మాలవత్ లక్ష్మణ్ నాయక్, సురోజు ఉపేందర్ చారి, రమావత్ సైదా నాయక్, మేకల శ్రీనివాస్, లంజపల్లి నాగరాజు,బెజ్జం సైదులు, బండావత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పాలకవీడు పి హెచ్ సి లో జాతీయ క్షయ నివారణ కార్యక్రమం





**పాలక వీడు, మార్చి 6(ప్రజా జ్యోతి ):**
నీక్షయ శివిర్ 100 రోజుల కార్యక్రమం ను పాలకవీడు మండలం లో గురువారం పాలకవీడు పి హెచ్ సి వద్ద పరీక్షలు నిర్వహించారు. ఈ కార్య క్రమం లో క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవారువారి కుటుంబ సభ్యులకు, దగ్గు, కళ్లె లో రక్తం పడటం, రాత్రి పూట జ్వరం తో కూడిన చెమటలు పట్టడం,ఆయాసం,ఆకలి లేక పోవడం, బరువు తగ్గడం, నీరసం వంటి లక్షణాలు వున్న ప్రతి ఒక్కరూ క్యాంప్ లో పరీక్షలు చేయించుకోవాలి అని పి హెచ్ సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.నాగిని తెలిపారు. తెమడ పరీక్షలు,చేస్ట్ ఎక్స్-రే లు, రక్త పోటు,మధుమేహం పరీక్షలు నిర్వహించారు. వివిధ లక్షణాలతో వున్న వారు పరీక్షలు 43 మంది స్ఫుట%శీ% పరీక్షలు, 121 మందికి డిజిటల్ ఎక్స్- రే లు, మధుమేహం,రక్తపోటు తదితర పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ సల్వాది శ్రీనివాస్, హెల్త్ సూపర్వైజర్ లు దైద. వెంకటేశ్వర్లు, కే.ధనమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ శారద, ఎం ఎల్ హెచ్ పి, పి.రమ్య,జి.రచన, స్టాఫ్ నర్స్, ఎస్.రేణుక, హెల్త్ అసిస్టెంట్లు, జి.ఎం నరసయ్య, ఎన్.విజయ సుశీల, ఎం.నాగేంద్ర, ఎస్ టి ఎస్, కె.మమత, కిరణ్, ఎక్స్-రే టెక్నీషియన్, జి.మాధవరెడ్డి, ఆశ వర్కర్లు, స్వాతి, స్వప్న, లలిత, కవిత, వెంకటమ్మ,తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో జిల్లా విద్యాధికారి ఆకస్మిక తనిఖీ.

**మునగాల మార్చి 6 (ప్రజా జ్యోతి):-**
మునగాల మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలను సూర్యాపేట జిల్లా విద్యాధికారి అశోక్, మునగాల మండల విద్యాధికారితో కలిసి ఉదయం స్టడీ అవర్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. అదేవిధంగా ప్రార్థన సమయంలో పిల్లలను ఉద్దేశించి ప్రసంగిస్తూ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే బాగా చదవాలని అభివృద్ధి చెందాలని విద్యార్థులకు సూచించారు. మునగాల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బ్లెస్సి అను విద్యార్థిని 2025 సంవత్సరంలో ఇన్స్పైర్ బహుమతి పొందినందుకు గాను బ్లెస్సిని అభినందించారు. అదేవిధంగా మండలంలోని ముకుందాపురం జడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి పాఠశాలలోని పరిస్థితులను పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలు చేసి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని, గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల సంఖ్య శాతాన్ని పెంచాలని, ఎస్పీ కోటిరెడ్డి పాఠశాల అభివృద్ధికై తన చేతనైనంత సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నారని ఉపాధ్యాయులందరూ ఐక్యంగా ఉండి పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. అదేవిధంగా కేజీబీవీ పాఠశాలలో తరగతి విద్యార్థులకు



నిర్వహిస్తున్న ఫ్రీ ఫైనల్ పరీక్షలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని విద్యార్థులందరూ బాగా చదివి మునగాల మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపడానికి కృషిచేసి జిల్లా స్థాయిలో మునగాల మండలానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచనలు చేశారు.

# బిజెపి పట్టభద్ర ఎమ్మెల్సీలు బిజెపికే పట్టం

**యువత అడుగులు కమలం వైపు**

**బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు భుక్యా శంకర్ నాయక్**

**మోతె మార్చి 06(ప్రజా జ్యోతి):**
బిజెపి పార్టీ అధ్యక్షుడు జి కిషన్ రెడ్డి పిలుపు మేరకు కోదాడ నియోజకవర్గం మోతె మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు బుఖ్య శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ విజయోత్సవ సంబరాలకు నిర్వహించడం జరిగింది ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ.... కాంగ్రెస్ పై ప్రజా వ్యతిరేకతకు ఈ విజయం నిదర్శనం అన్నారు.పట్టభద్రుల ఎమ్మెల్సీగా మల్క కొమరయ్య,చిన్నమైల్ అంజిరెడ్డి లకు పట్టంకట్టిన ఉత్తర తెలంగాణను బిజెపి కంచుకోటగా మార్చిన ఉపాధ్యాయులు,మేధావులు పట్టభద్రులకు,బిజెపి నాయకులకు,కార్యకర్తలకు పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బిజెపి శ్రేణులు బాణసంచా కాల్చి,సీట్లు పంపిణీ చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కౌన్సిలర్ నెంబర్ బానోత్ సింగ్



నాయక్,సోమ గాని సోమేశ్ గౌడ్ , మైనంపాటి శ్రీనివాస్ రెడ్డి,పెరుగు మధు యాదవ్, రామచంద్రయ్య, సాయిధ నాయక్, నాగం వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పతనానికి ఈ విజయమే నాంది

**యువత అడుగులు కమలం వైపు**

**పట్టభద్రుల ఎమ్మెల్సీలో భాజాపాకే పట్టం**

**సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలతరెడ్డి**

**గరిడేపల్లి,మార్చి 06(ప్రజా జ్యోతి):**
కాంగ్రెస్ పతనానికి ఈ విజయమే నాందని సూర్యాపేట జిల్లా భాజాపా అధ్యక్షురాలు చల్ల శ్రీలత రెడ్డి అన్నారు.రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు జి కిషన్ రెడ్డి పిలుపుమేరకు హుజూర్ నగర్ నియోజకవర్గం గరిడేపల్లి మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు కుక్కడపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ విజయోత్సవ సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పై ప్రజా వ్యతిరేకతకు ఈ విజయం నిదర్శనం అన్నారు.పట్టభద్రుల ఎమ్మెల్సీగా మల్క కొమరయ్య,చిన్నమైల్ అంజిరెడ్డి లకు పట్టంకట్టిన ఉత్తర తెలంగాణను బిజెపి కంచుకోటగా మార్చిన ఉపాధ్యాయులు,మేధావులు పట్టభద్రులకు,బిజెపి నాయకులకు,కార్యకర్తలకు పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బిజెపి శ్రేణులు బాణసంచా కాల్చి,సీట్లు పంపిణీ చేసి హర్షం వ్యక్తం చేశారు.

**యువత అడుగులు కమలం వైపు**

ఎమ్మెల్సీ విజయోత్సవ ర్యాలీ అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంపై నమ్మకంతో వెల్దండ గ్రామానికి గ్రామానికి చెందిన యువకులు భాజాపా జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలత రెడ్డి ఆధ్వర్యంలో బిజెపిలో చేరారు.కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికార పార్టీ చేస్తున్న అవినీతి,దోపిడి పాలనకు వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో మరింత మంది భారతీయ జనతా పార్టీలోకి చేరడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు.రాష్ట్ర అభివృద్ధి బిజెపితోనే సాధ్యమవుతుందని యువత పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుక్కడపు వెంకటేశ్వర్లు,జిల్లా కౌన్సిల్ సభ్యుడు నర్సింగ్ అంజయ్య, జిల్లా నాయకులు పోకల వేంకటేశ్వరలు,మేకల వెంకటేశ్వర్లు,రామీనేని కృష్ణయ్య,చిత్తలూరి సోమయ్య,మహిళా నాయకురాలు




శోభారెడ్డి, అనంతు గురువయ్య, చంద్రశేఖర్ రెడ్డి,నర్సింగ్ నాగ సైదులు,బుడిగ వెంకన్న, మండవ సత్యం,సిద్దు,బొమ్మ బాలకృష్ణ,రాజు నాయక్, బాలు తదితరుల పాల్గొన్నారు.



## ఎంపీపీఎస్ కోటమర్తి లో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం




**అడ్డగూడూర్ మార్చి 6( ప్రజా జ్యోతి)**
అడ్డగూడూర్ మండలంలోని కోటమర్తి ఎంపీపీఎస్ పాఠశాలలో గురువారం నాడు విద్యార్థులే ఉపాధ్యాయులుగా స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో హెడ్మాస్టర్ గా కె అక్షిత రెడ్డి మరియు ఎంఈఓ గా జి తేజశ్రీ బాధ్యతాయుత పాత్రలను పోషించారు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులుగా విద్యార్థిని విద్యార్థులు పాత్రలను పోషించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చుక్కల వెంకటయ్య మాట్లాడుతూ నేటి విద్యార్థులే ఉపాధ్యాయుల పాత్రలు పోషించారు అదేవిధంగా నేడు పోషించిన పాత్రలను తమ జీవితంలో సాధికారత చేసుకోవాలని విద్యార్థిని విద్యార్థులు ఇష్టంతో చదువుకొని ఉన్నత చదువులు చదివి జీవితంలో అత్యున్నత స్థాయిలను చేరుకోవాలని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి వెంకటేశ్వర్లు,నరసింహ రావు బోనాల రమేష్, మమత, రేణుక,రహీమున్నీసా, తదితరులు పాల్గొన్నారు

## గజ్జల అంజయ్య కుటుంబానికి అండగా మండల ఆర్ఎంపీ సంఘం



**మునగాల మార్చి 6 (ప్రజా జ్యోతి):-**
మునగాల మండలం ఆకుపాముల గ్రామంలో సీనియర్ గ్రామీణ వైద్యులు గజ్జల అంజయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. మండల ఆర్ఎంపీ కమిటీ సభ్యులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇస్తూ రు. 5 వెలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మునగాల మండల గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షులు వెలది వెంకటప్ప చారి, కార్యదర్శి దాచేపల్లి మురళీకృష్ణ, కోశాధికారి యార్లగడ్డ బిక్షం, ఉపాధ్యక్షులు చంద్రమౌళి, లక్ష్మణ్ రాజు, గ్రామీణ వైద్యుల జిల్లా ఉపాధ్యక్షులు సరికొండ నాగరాజు, జిల్లా సహాయ కార్యదర్శి లింగయ్య రాంబాబు, కమిటీ సభ్యులు సురేష్, సైదిరెడ్డి, వెంకటేష్, అంజయ్య, శ్రీను, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు

**మునగాల మార్చి 6 (ప్రజా జ్యోతి):-**
మునగాల మండల కేంద్రం లోని సాయి గాయత్రి విద్యాలయలో కోదాడ అగ్నిమాపక సిబ్బంది , విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది విద్యార్థులకు అగ్రి ప్రమాదాల నివారణ మరియు అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ అరవపల్లి శంకర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించినందుకు అగ్నిమాపక సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు.

